ఆయన మహాదినాన తీర్పు తీర్చడానికి కటిక చీకటిలో, శాశ్వతమైన
గొలుసులతో బంధించి ఉంచారు.
7 అదే విధంగా, సొదొమ, గొమొర్రాలు ఆ చుట్టుప్రక్కల
పట్టణ ప్రజలు లైంగిక దుర్నీతికి పాల్పడ్డారు, ప్రకృతి విరుద్ధమైన
వ్యామోహానికి లోనయ్యారు. ఆ ప్రజలు నిత్యాగ్ని శిక్షను
అనుభవించబోయే వారికి ఒక ఉదాహరణగా ఉన్నారు.

8 అదే విధంగా, ఈ భక్తిహీనులు తమ కలల ప్రభావం వలన తమ
శరీరాలను మలినం చేసుకుంటారు, అధికారులను తృణీకరిస్తారు,
పరలోక సంబంధులను దూషిస్తారు.
9 మోషే శరీరం గురించి సాతానుతో తనకు వచ్చిన తగాదాలో,
దేవదూతల్లో ప్రధానుడైన మిఖాయేలు కూడ సాతానును
అవమానకరమైన మాటలతో నిందించలేదు కాని కేవలం, "ప్రభువు
నిన్ను గద్దించును గాక!" అని మాత్రమే అన్నాడు.
10 అయినా ఈ ప్రజలు తాము గ్రహించలేని వాటిని దూషిస్తారు,
అంతేకాక తెలివిలేని జంతువులు చేసినట్లు, వారు వేటిని
సహజసిద్ధంగా గ్రహిస్తారో, అవే వారిని నాశనం చేస్తాయి.

11 వారికి శ్రమ! వారు కయీను త్రోవను అనుసరించారు; లాభం
పొందాలని బిలాములా తప్పు మార్గాల్లో పరుగెత్తారు; కోరహులా
తిరుగుబాటు చేయడం వలన నాశనం చేయబడ్డారు.

12 వీరు మీ ప్రేమ విందుల్లో, వినోదాలలో సిగ్గువిడిచి తింటూ,
త్రాగుతూ మాయని మచ్చలుగా ఉన్నారు, వారు కేవలం తమను
తాము పోషించుకునే కాపరుల్లా ఉన్నారు. వారు గాలికి
కొట్టుకుపోయే, వాన కురవని మబ్బుల వంటివారు. ఆకురాలు
కాలంలో, ఫలాలులేకుండా పెల్లగింపబడి రెండు సార్లు చనిపోయిన
చెట్లవంటివారు.
13 వారు తమ సిగ్గును నురుగులా కనబడేలా చేసే సముద్రపు
భయంకరమైన అలల వంటివారు. వారు నిలకడలేని నక్షత్రాల
వంటివారు. వారి కోసం కటిక చీకటి నిరంతరం భద్రం చేయబడి ఉంది.

14 ఆదాము నుండి ఏడవ తరం వాడైన హనోకు వారి గురించి
ఇలా ప్రవచించాడు: "చూడండి, వేవేలకొలది తన పరిశుద్ధ జనంతో
ప్రభువు వస్తారు.
15 అందరికి తీర్పు తీర్చడానికి, వారి భక్తిహీనతలో వారు చేసిన
దుష్ట కార్యాలను, భక్తిహీనులైన పాపులు ఆయనకు వ్యతిరేకంగా
పలికిన ధిక్కారపు మాటలను వారందరిచేత ఒప్పింపజేస్తారు."
16 వారు ఎల్లప్పుడు సణుగుతూ ఇతరులలో తప్పులు
వెదుకుతారు; వారు తమ చెడు కోరికలనే అనుసరిస్తారు; వారు
తమ గురించి తామే పొగడుకొంటారు, స్వలాభం కోసం ఇతరులను
పొగడ్తలతో ముంచెత్తుతారు.

## పట్టుదలగా ఉండడానికి పిలుపు

17 కాని, ప్రియ మిత్రులారా, మన ప్రభువైన యేసు క్రీస్తు
అపొస్తలులు మీకు ముందుగానే ఏమి చెప్పారో జ్ఞాపకం చేసుకోండి.
18 "అంత్యదినాలలో తమ చెడు కోరికలనే అనుసరించే
అపహాసకులు ఉంటారు" అని వారు మీకు చెప్పారు.
19 అలాంటివారు సహజ సంబంధులు, వీరు ఆత్మలేనివారిగా
ఉండి, మీలో విభేదాలు పుట్టిస్తారు.
20 కాని, ప్రియ మిత్రులారా, అతిపరిశుద్ధమైన మీ విశ్వాసంలో
మిమ్మల్ని మీరు బలపరచుకొంటూ, పరిశుద్ధాత్మలో ప్రార్థిస్తూ,
21 మీకు నిత్యజీవాన్ని దయచేసే మన ప్రభువైన యేసు క్రీస్తు
కనికరం కోసం మీరు ఎదురుచూస్తూ ఉంటూ మీరు దేవుని ప్రేమలో
నిలిచి ఉండండి.
22 సందేహించే వారిపై దయ చూపండి;
23 అగ్నిగుండం నుండి బయటకు లాగినట్లు ఇతరులను
రక్షించండి. మరికొందరిపై భయంతో కూడిన కనికరం చూపండి.
అయితే శరీర అపవిత్రతతో మరకపడిన వారి దుస్తులను కూడా
ద్వేషించండి.

